క్లుప్తంగా

న్యాయవాదుల కో ఆపరేటివ్ సొసైటీ కమిటీ ఎన్నిక



వరంగల్ లీగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లా న్యాయవాదుల కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా పీసరి రాము, ప్రధాన కార్యదర్శిగా గంధం సురేష్ ఎన్నికయ్యారు. మంగళవారం సమావేశమైన డైరెక్టర్లు 2025–26 సంవత్సరానికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఉప్పు కృష్ణారావు, కోశాధికారిగా నాంసాని చంద్రశేఖర్‌లు ఎన్నికయ్యారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులకు సన్మానం



నయీంనగర్ : నూతనంగా ఎన్నికైన హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు పులి సత్యనారాయణ, వలుస సుధీర్, ప్రధాన కార్యదర్శులు కొత్త రవి, దండాపంతుల రమాకాంత్‌లకు శాలువాలు కప్పి గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ జ్ఞాపికలతో కార్యవర్గం సన్మానించింది. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగు స్తంభాల్లో భాగమైన జ్యుడీషియరీ, మీడియాలు సహకరించుకుంటూ సమాజానికి ఉపయోగపడేలా పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, కార్యవర్గసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ బార్ అధ్యక్షుడికి..

వరంగల్ లీగల్ : ఇటీవల వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన వలుస సుధీర్‌ను మంగళవారం జిల్లా కోర్టులోని అంబేడ్కర్ హాల్‌లో పోపా నాయకులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోపా రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది శామంతుల శ్రీనివాస్, వరంగల్ అధ్యక్షులు గుండు కామేశ్వర్, రాష్ట్ర ప్రతినిధులు సుధాకర్, రాజగోవింద్, శ్రీనివాస్, అశోక్‌కుమార్, న్యాయవాదులు మహాత్మ, రాజ్‌కుమార్, సుభాష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

యూఎస్ఓ పోటీల్లో రవికుమార్ ప్రతిభ



హన్మకొండ : యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ నిర్వహించిన ప్రతిభ పాటవ పోటీల్లో మండలంలోని పలివేల్పుల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెనిశెట్టి రవికుమార్ ప్రతిభకనబరిచారు. యూఎస్ఓ ఏర్పాటై 75 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఫ్యూచర్ మీ అనే అంశంపై దేశవ్యాప్తంగా ప్రభుత్వ, కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు పోటీ నిర్వహించారు. ఈ అంశంలో 500 మంది పాల్గొనగా ప్రతిభ కనబరిచిన 75 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఇందులో రవికుమార్ 35వ స్థానాన్ని పొందగా ప్రశంసాపత్రాన్ని యూఎస్ఓ అందజేసింది.

సీకేఎం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ధర్మారెడ్డి



దేశాయిపేట : దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఏ.ధర్మారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మార్చి 31న ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్‌రావు పదవీ విరమణ పొందడంతో ఆ స్థానంలో కళాశాలలో కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ధర్మారెడ్డికి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన ధర్మారెడ్డికి పలువురు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు.

డీఎంఆర్‌కేఎస్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మోతీలాల్

కాజీపేట రూరల్ : స్థానిక రైల్వే డీజిల్ లో కో షెడ్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న ఎస్.మోతీలాల్‌ను దక్షిణ మధ్య రైల్వే కార్మిక్ సంఘ్ (డీఎంఆర్‌కేఎస్) జోనల్‌స్థాయి నాయకులు రెండోసారి డీఎంఆర్‌కేఎస్ సికింద్రాబాద్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మోతీలాల్ మాట్లాడుతూ ఈ నెల 13న నాందేడ్‌లో జరిగిన డీఎంఆర్‌కేఎస్ జనరల్ కౌన్సిల్ మీటింగ్‌లో తనను న్యూఢిల్లీ బీఆర్ఎంఎస్ జనరల్ సెక్రటరి మంగేష్‌దేశ్ పాండే, బీఎంఎస్ అధ్యక్షుడు రాంమోహన్ సమక్షంలో రెండోసారి జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎండకు ఆవిరైపోతున్న చెరువు

- మింగేస్తున్న గుర్రపు డెక్క
- మత్స్యకారుల జీవితం ప్రశ్నార్థకం

కాజీపేట అర్బన్ : ఊరికి చెరువు ఆదెరువు అనే నానుడికి విరుద్ధంగా ప్రకృతి కోపానికి భానుడి భగభగకు ఊరు చెరువు కరువును తలపిస్తుంది నాగుల చెరువు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని ఈ చెరువు 33 ఎకరాల విస్తీర్ణంలో 250 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. పంట పొలాలకు నీరందిస్తూ పచ్చని పొలాలతో అన్నదాతలకు నిలువుగా, మత్స్యకారులకు జీవనోపాధిని కల్పిస్తూ కల్పవృక్షంగా నిలుస్తుంది.

23 ఎకరాల్లో విస్తరించిన గుర్రపు డెక్క..

నాగుల చెరువును గుర్రపు డెక్క రంకెలేస్తూ పూర్తిగా ఆక్రమించి చెరువు మొత్తం గుర్రపు డెక్కతో మింగేస్తుంది. కాగా ఇటీవల పెరుగుతున్న ఉష్ణోగ్రత ఓ వైపు చెరువు పూడికతీత తీయకపోవడం మరోవైపుతో భూగర్భజలాలు పడిపోయి 33 ఎకరాల నాగుల చెరువు 10 ఎకరాల్లో నీటితో మిగతా గుర్రపు డెక్క, చెరువులోని మట్టితో దర్శనమిస్తుంది.



గుర్రపు డెక్కతో నిండిపోయిన నాగుల చెరువు



నీరు ఎండిపోయి మట్టితో ఉన్న చెరువు

600 కుటుంబాలకు ఉపాధి



నాగుల చెరువుపై సుమారు 600 ముదిరాజ్ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. చెరువులో నీటి శాతం పడిపోవడం, గుర్రపు డెక్కతో నిండిపోయింది. – సాధినేని సుధాకర్, కడిపికొండ

మినిమం టైం స్కేల్‌తో ఉద్యోగభద్రత కల్పించాలి

- పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు రాంబాబు

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని పార్ట్‌టైం లెక్చరర్లకు టైం స్కేల్‌తో కూడిన ఉద్యోగ భద్రత కల్పించాలని, పలు సమస్యల పరిష్కారానికి ఈనెల 17న చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున అధ్యాపకులంతా విజయవంతం చేయాలని కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం కేయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లుగా పార్ట్‌టైం అధ్యాపకులుగా పనిచేస్తున్న వారిని మినిమం టైం స్కేల్‌తో ఉద్యోగ భద్రత కల్పించి నూతనంగా ప్రభుత్వం చేపట్టబోయే అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధ్యాపకుల నియామకాల్లో పీజీని పరిగణలోనికి తీసుకోవాలని అత్యున్నత అర్హత కలిగిన పీహెచ్‌డికి ఎక్కువ వెయిటేజ్ ఇవ్వాలని అందుకు అనుగుణంగా మార్గదర్శకాల్లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ నరేంద్రనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ దేవోజి నాయక్, బాధ్యులు తిరునహరిశేషు, సురేష్, రమేష్, రాజన్న, శ్రీదర్, ప్రభాకర్,భాగ్యమ్మ, వినోద, జ్యోత్స్న, వాణిదేవి, సద్గుణ, మానిక, నవీన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత పలు డిమాండ్లతో కూడిన చలో సెక్రటరియేట్ కరపత్రాన్ని ఆవిష్కరించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాంబాబు

సంఘటితంతోనే సమస్యల పరిష్కారం

- సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి

ఖిలా వరంగల్: కార్మికుల సంఘటితంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. మంగళవారం వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఎండి యాకూబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా కార్మికుల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదన్నారు. కేంద్ర, రాష్ట్రంలో అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఆ పార్టీ కేవలం మాటలతో కాలం గడిపేవారే తప్ప ఆచరణలో మాత్రం కార్మికులకు ఒరిగింది ఏమీలేదన్నారు. కార్మికుల పక్షాన పోరాడే సంఘం ఏఐటీయూసీ అని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయకార్యదర్శులు షేక్ బాష్‌మియా, పనాస ప్రసాద్, రమేష్, గోవర్ధన్, లక్ష్మణ్, బద్రి, రవి, కుమార్, రమేశ్, యోగానంద తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి

ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాలి

ఖిలా వరంగల్: రైలులో ప్రయాణికులు జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణం చేయాలని ఆర్‌పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. సీఐ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రయాణికుల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రైలులో కిటికీల వద్ద కూర్చొని ప్రయాణించే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని దుండుగలు చోరీలకు పాల్పడటం, పిల్లలు రాళ్లతో విసిరివేయటం వల్ల ప్రయాణికులకు గాయాలవుతాయని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ షిండే పాల్గొన్నారు.

నేడు బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ క్యాంపు

వరంగల్ : వరంగల్ కేఎంసీ పక్కనే ఉన్న బీఎస్ఎన్ఎల్ భవన్‌లో నేడు (బుధవారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కస్టమర్ సర్వీస్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు డీజీఎం విజయభాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్ఎన్ఎల్ వివిధ సర్వీసులు, సమస్యలు పరిష్కరించబడతాయని, వినియోగదారులు ఈ అవకాశాలను సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

దేవన్నపేటలో సీపీఎం సర్వే

హసన్‌పర్తి : గ్రేటర్ పరిధిలోని 65వ డివిజన్ దేవన్నపేటలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం సర్వే చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్, ఇల్లు కూడా ఇవ్వలేదని స్థానికులు చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అశోక్, మౌనిక, లలిత, రాజు, చిన్ని, రవీందర్, వెంకటయ్య, రాజయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 16న వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్‌టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలి ఎం. కీర్తినగర్, ఏకశిల జంక్షన్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 12 గంటల వరకు, గవిచర్ల క్రాస్‌రోడ్, గణేష్‌నగర్, నాయుడు పెట్రోల్‌పంపు, రుద్రమాంబ వాటర్‌ట్యాంక్, కురుమ సంఘం, నానామియా తోట, గుండు మైసమ్మ, ఎల్లమ్మ తాళ్లు, అబ్బనికుంట, ఎస్ఆర్‌టీ, టీఆర్‌టీ కాలనీ, జాన్‌పీరీలు, 100 ఫీట్ల రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, గోవిందరాజుల గుట్ట, గిర్మాజీపేట, ఫారెస్ట్ అసోసియేషన్, పెట్రోల్ పంపు, కూరగాయల మార్కెట్, జేపీఎన్ రోడ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

హనుమకొండలో...

హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 16న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నక్కలగుట్ట మెయిన్‌రోడ్, హరిత హోటల్, ఏకశిల పార్కు రోడ్, కృష్ణా కాలనీ, యాదవనగర్ పెట్రోల్ పంపు, గౌతంనగర్, ఏఏఆర్ గార్డెన్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కేఎస్ఆర్ గార్డెన్, హనుమాన్ జంక్షన్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, కెఎల్ఎన్ రెడ్డి కాలనీ, సుబేదారి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, రాంపూర్ ఇండస్ట్రీయల్ ఏరియా, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలి

ఖిలా వరంగల్ : అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరికి అవగాహన పెంచుకోవాలని వరంగల్ అగ్నిమాపక అధికారి రాజేశ్వర్‌రావు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో వరంగల్ అగ్నిమాపక అధికారుల ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు.

జర్నలిస్టులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

దేశాయిపేట: ప్రభుత్వానికి ప్రజలకు ఎల్లప్పుడు వారధిలా ఉండే జర్నలిస్టులకు తక్షణమే డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, బీఆర్ఎస్ నాయకురాలు డాక్టర్ హరిరమాదేవి, సీపీఎం కాశిబుగ్గ ఏరియా కార్యదర్శి బషీర్, సీపీఐ నాయకులు మేకల రవిలు అన్నారు. దేశాయిపేటలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద తూర్పు జర్నలిస్టులు చేపట్టిన నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. మంగళవారం దీక్షల శిబిరాన్ని సందర్శించిన నాయకులు సంఘీభావం తెలిపారు.

పిల్లల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఖిలా వరంగల్ : ప్రభుత్వ జిల్లా యంత్రాంగం పిల్లల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని డాన్ బాస్కో నవజీవన్ అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్, డైరెక్టర్ ఫాదర్ కోషి అన్నారు. మంగళవారం శివనగర్‌లోని డాన్ బోస్కో నవజీవన్ స్ట్రీట్ చిల్డ్రన్ హోమ్‌ను డైరెక్టర్లు వారు సందర్శించారు. చిన్నపిల్లలకు అందుతున్న సేవలను డాన్ బాస్కో నవజీవన్ కోఆర్డినేటర్ అవినాష్, ఫీల్డ్ కోఆర్డినేటర్ రాజులను అడిగి తెలుసుకున్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ మండల పరశురాములు అధ్యక్షతన జరి గిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి ఉద్యోగావకాశాల కోసం వరంగల్‌కు వచ్చే కార్మికుల పిల్లలు విద్య, ఆరోగ్య, పోషణ సంబంధిత సమస్యలని ఎదుర్కొంటున్నారని తెలిపారు.

అశోక్‌కు ఉగాది జాతీయ పురస్కారం

వరంగల్ : మూడు దశాబ్దాలుగా, విద్య, వైద్యం, సామాజిక సేవా రంగాల్లో రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాశిబుగ్గకు చెందిన ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్‌కు ఉగాది పురస్కారం లభించింది. మంగళవారం హైదరాబాద్ నార్సింగిలోని ఓం కన్వెన్షన్‌లో పద్మశాలి బిజినెస్ నెట్వర్క్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పురస్కారం మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనంద్‌భాస్కర్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్.రాములు, నిమ్స్ డైరెక్టర్ రమేష్‌లు అందజేశారు.

ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

వరంగల్ : ఇండియన్ నేషన్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో వరంగల్ ఎల్‌బీ నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ బండారి కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షల్లో 229 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారని, అందులో గ్రాండ్ ప్రైజ్, గోల్డ్‌మెడల్, మెరిట్ సర్టిఫికెట్లతో పాటు కన్సోలేషన్ ప్రైజ్‌లు అందుకున్నారని తెలిపారు.

జయరాజ్‌కు భారత్ సేవారత్న నేషనల్ అవార్డు



మడికొండ : మడికొండ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జయరాజ్‌కు భారత్ సేవారత్న నేషనల్ అవార్డు–2025 మనం ఫౌండేషన్ డాక్టర్ చక్రవారం సోమవారం అందజేశారు. జయరాజ్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు. జయరాజ్ రక్తదానం చేయడంలోనూ, ప్రతీ పండుగకు పేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తూ ఇప్పటి వరకు 17 మందికి ఐ బ్యాంక్‌కు కళ్లను దానం చేయించారు. పేద విద్యార్థులకు సహకారం అందజేస్తుండటాన్ని గుర్తించి 2025కు గాను ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక వ్యక్తికి తనకు తోచిన సాయం చేయాలన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్

హసన్‌పర్తి : స్థానిక పెద్ద చెరువు కట్టను శుభ్రం చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ప్రతి రోజు వందలాది మంది వాకర్స్ ఈ కట్టను వినియోగిస్తున్నారు. అయితే కట్టకు ఇరువైపులా పిచ్చిమొక్కలతో పాటు కట్టపై వ్యర్థ పదార్థాలు పడేయడంతో వాకర్స్ ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో బీజేపీ ఆధ్వర్యంలో కట్టను శుభ్రం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్ సమీపాన ఎస్‌బీహెచ్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం .. వరంగల్ ఫోర్ట్ ఇసుక అడ్డా జంక్షన్ వద్ద విక్రయదారులు పాత దర్వాజలు పెట్టడం వల్ల వాహనం అదుపు తప్పి పాత దర్వాజను ఢీకొంది. దీంతో వాహనదారుడు రోడ్డుపై పడి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని వెంటనే 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు. మిల్స్ కాలనీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

సంజీవకు దళితరత్న అవార్డు



వరంగల్: వరంగల్ జిల్లా నుంచి నగరంలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన పోగుల సంజీవ దళితరత్న అవార్డును అందుకున్నారు. అంబేడ్కర్ జయంతిని సందర్భంగా సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో జరిగిన ఉత్సవాల్లో ఈ అవార్డును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉత్సవ కమిటీ నాయకులు రామచందర్, వర్కింగ్ కమిటీ చైర్మన్ ఇటుక రాజు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నాడు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



హసన్‌పర్తి: గ్రేటర్‌లోని 2వ డివిజన్ వంగపహాడ్‌లో వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతానికి చెందిన సూదుల వెంకట్‌రెడ్డి మొక్కజొన్న పెరడుకు తీగలు ఆనుకుంటున్నాయి. గాలి దుమారం వచ్చినప్పుడు పెరడుకు మంటలు లేవడమే కాకుండా విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని రైతులు తెలిపారు.

అబద్ధపు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- సిల్వర్ జూబ్లీ వేడుకలకు భారీగా తరలిరావాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

వరంగల్: అబద్ధపు హామీలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ కాశిబుగ్గ కేవీ ఫంక్షన్ హాల్‌లో పార్టీ సీనియర్ నాయకుడు కేతిరి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈనెల 27న జరుగుతున్న సిల్వర్ జూబ్లీ వేడుకలకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సర్వే ప్రకారం రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినా గెలిచేది బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. డివిజన్ కార్యకర్తలు ఆధైర్యపడవద్దని తాను అన్నివేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మార్పును కోరుకున్న ప్రజలు ఇప్పుడు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పార్టీ మారిన దొంగలను మరోసారి పార్టీలోకి తీసుకునే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షురాలు ఎల్లావుల లలితాయాదవ్ సీనియర్ నాయకులు కుమార్ యాదవ్, గండ్రతి భాస్కర్, పత్రి రాజాపోశాలు, మల్లయ్య, యాదగిరి, కళ్యాణ్, శ్రీనివాస్, వీర చారి, పత్రి సుభాష్, కట్ల నాగరాజు, కేతిరి సమ్మక్క, పున్నాం ప్రభాకర్, కేతిరి సంతోష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికే దిక్సూచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు



కేయూ క్యాంపస్ : అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న రాంబాబు

కేయూ క్యాంపస్: ప్రపంచానికే దిక్సూచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో రాజ్యాంగం–అంబేడ్కర్ దార్శనికత అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. దేశంలో కుల రహిత సమాజాన్ని ఆయన ఆకాంక్షించారన్నారు. అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, కేయూ ఏబీవీపీ అధ్యక్షుడు మెరుగు సాయికుమార్, బాధ్యులు కిరణ్, పూజ, రాజ్‌కుమార్, ప్రశాంత్, సంయుక్త, సాయిప్రియ, శివ, ఎలేంద్ర, పాల్గొన్నారు.

డీజిల్ లోకోషెడ్‌లో అంబేడ్కర్ జయంతి

కాజీపేట రూరల్ : కాజీపేట డీజిల్ లోకోషెడ్‌లో మంగళవారం ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ డీజిల్ బ్రాంచి ఆధ్వార్యాన అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ వెంకటకుమార్ పాల్గొని మాట్లాడారు. అనంతరం షెడ్ కార్మికులుకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిఇల్ షెడ్ డీఎంఈ అనికేత్ ఖాడే, ఎడిఎంఈ–1 ఎం.భానుప్రకాష్, ఏడిఎంఈ–2 నాగరాజశేఖర్, ఎసిఎంటి రవీంద్రకుమార్, ఎల్ఎఫ్ రాజశేఖర్, ఈఎఫ్ రమేష్‌కుమార్, రైల్వే ఎస్సీ ఎస్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండా.. పేద ప్రజల అండ

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జ్యోతి

మడికొండ : ఎర్ర జెండా పేద ప్రజల అండ అని భారత కమ్యునిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. మంగళవారం కాజీపేట మండలం మడికొండలోని రావి నారాయణరెడ్డి కాలనీలో గుగులోతు రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జ్యోతి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం విభజన రాజకీయాలు చేస్తూ దేశాన్ని విడగొట్టే చర్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలు ముస్లిం మైనార్టీ వ్యతిరేక చట్టాలు తీసుకొస్తూ ముస్లింల, రైతులు, దళితులపై దాడులు కొనసాగించడానికి ప్రజాస్వామిక వాదులు తిప్పి కొట్టాలన్నారు. మే 26, 27 తేదీల్లో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్, నేదునూరి రాజమౌళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సాంగపాణి, కాజీపేట మండల సీపీఐ కార్యదర్శి మునిగాల భిక్షపతి, సహాయకార్యదర్శి శంకర్, దీన, ప్రవీణ్, సుమన్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

మేదరి కుల వృత్తిని కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

- సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

హన్మకొండ : మేదరి కుల వృత్తిని కాపాడుకుందామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రతాపగిరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెళ్లి పందిరిలు (తడుకలు క్లాత్ డెకరేషన్) మేదరి కుల వృత్తిదారులు మాత్రమే వేయాల్సిన పని అని వివరించారు. వీటిని ఈవెంట్ నిర్వాహకులు చేస్తుండడంతో కుల వృత్తిని నమ్ముకున్న వారికి అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈవెంట్ నిర్వాహకులు తడకల పందిర్లు వేసే పనిని మేదరి కులం వారికే అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కోరుట్ల రమేష్, బొమ్మిడి రమేష్, మహేందర్, విజయ్, దేవేందర్, దిలీప్, రమేష్, అంజి, వలిపిరెడ్డి రమేష్, కుమార్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

కామర్స్ మేనేజ్‌మెంట్‌తో ఉపాధి అవకాశాలు

- కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కామర్స్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు విస్తృతంగా ఉపాధి అవకాశాలున్నాయని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. క్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు సినర్జీ 2కె5 మీట్ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థికి కూడా ఒక రోల్‌మోడల్ ఉండాలన్నారు. కేవలం తరగతి గదిలోనే కాకుండా ఇలాంటి సమ్మేళనం ద్వారా మరిన్ని నేర్చుకోగలుగుతారన్నారు. 2030 వరకు ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ బిజినెస్ స్కిల్స్‌పై, మార్కెటింగ్ స్కిల్స్‌పై క్విజ్ పోటీలను నిర్వహించగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ అమరవేణి, యూనివర్సిటీ పీజీ కాలేజి ప్రిన్సిపాల్ ఆచార్య వరలక్ష్మి, ఓంప్రకాశ్, రాజేశం, రాజేందర్, రాజిరెడ్డి, కృష్ణమాచార్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

'మీ సేవ'లో తిష్టవేసిన పాము

వరంగల్ : వరంగల్ కార్పొరేషన్ ఆవరణలోని మీసేవ కార్యాలయం వాష్‌రూంలో పాము ఉన్నట్లు ఉద్యోగులు మంగళవారం గుర్తించారు. పామును పట్టేందుకు వచ్చిన వ్యక్తి వాష్‌రూం గోడ పగుల్లో ఇరుక్కుపోయి ఉన్నట్లు గుర్తించాడు. పామును తీయాలంటే గోడలోని కొంత భాగం తొలగించాలని సూచించగా అందుకు ఉన్నతాధికారుల అనుమతి అవసరం కావడంతో వాయిదా పడింది. ఈ విషయాన్ని బల్దియా ఉన్నతాధికారులకు వివరించడంతో రేపటికి పామును పట్టే కార్యక్రమం వాయిదా పడింది. గోడలో ఇరుక్కపోయిన పాము ఎటూ కదలలేని పరిస్థితిలో ఉండడంతో వాష్‌రూంకు తాళం వేసి ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు.